

శ్రీనగర్‌కాలనీలో రోడ్లపైనే వ్యర్థాలు పేరుకుపోవడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలుపడుతున్నారు.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, గురువారం 20 మార్చి 2025 HYDERABAD



పంజాగుట్ట చౌరస్తాలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్

# పాత పద్దులతో సరిపెట్టారు

- తొలి బడ్జెట్‌లో రూ.10వేల కోట్లతో ఊదరగొట్టిన రేవంత్ సర్కార్
- ఏడాదిగా నగరాభివృద్ధికి నిధుల విడుదల పావు వంతే
- తాజాగా బడ్జెట్ ప్రసంగంలో హైదరాబాద్ విడిచి ఫ్యూచర్ సిటీ జపం
- త్రిపుల్ ఆర్ దాకా నగరం విస్తరించినా కేటాయింపుల్లో కనిపించని జోష్

**సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 19 (నమస్తే తెలంగాణ):**

మాటలతో కోతలు కోయడం సులువు.. కానీ చేతలతో మెప్పు పొందడమనేది అంత ఈజీ కాదు సుమా. గత సంవత్సరంతో పోలిస్తే తాజా బడ్జెట్ వరకు కాంగ్రెస్ సర్కారు ఈ తత్వం బోధపడినట్లుంది. అందుకే పోయినేడాది హైదరాబాద్ నగరాభివృద్ధికి చారిత్రాత్మకంగా రూ.10వేల కోట్ల కేటాయింపులు అంటూ ఊదరగొట్టిన ప్రభుత్వ 'మహా' సంకల్పం తాజా బడ్జెట్‌లో నీరుగారినట్లు స్పష్టమవుతున్నది. అందుకే బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కేసీఆర్ ప్రభుత్వం చేసిన హైదరాబాద్ అభివృద్ధి పనులనే తమ ఖాతాలో వేసుకొని పఠించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గతేడాది రూ.10వేల కోట్లు కేటాయించామని చెప్పుకున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలులో ఏడాదిగా అందులో పావు వంతు నిధులు మాత్రమే విడుదల చేసిన చేతులు దులుపుకొంది. ఈ నేపథ్యంలో తాజా బడ్జెట్‌లో హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి బదులు ఫ్యూచర్ సిటీ జపం చేసినట్లు అవగతమవుతున్నది.

### ఒక్క కొత్త ప్రాజెక్టూ పట్టాలెక్కలేదు..

హైదరాబాద్ విశ్వ నగరమనేది జగమెరిగిన సత్యం. కాకపోతే ప్రభుత్వాలు ముందుచూపుతో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తే ఆ మేరకు అంతర్జాతీయంగా ఖ్యాతి విస్తరిస్తుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నగరవ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనే అనేది దేశంలోని ఇతర మెట్రో నగరాలను తలదన్నేరీతిలో ఉందనేది వాస్తవం. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో మౌలిక వసతులకు సంబంధించి ఒక్కటంటే ఒక్క కొత్త ప్రాజెక్టు పట్టాలెక్కకపోగా... గతంలోని ప్రాజెక్టుల పనులు సైతం పూర్తయిన దాఖలాలు లేవు. ఇందుకు గత ఏడాది కాలంగా (2024-25 ఆర్థిక సంవత్సరం) నగరంలోని కీలక విభాగాలకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులే నిదర్శనం. గత ఏడాది ఇదే నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం చేతికి ఎముక లేనట్లు కేటాయింపులు చేసింది. చరిత్రలో ఎన్నడూలేని విధంగా నగరాభివృద్ధికి రూ.10వేల కోట్ల బడ్జెట్ కేటాయింపులు చేశామంటూ భీకర ప్రచారం చేసింది. కానీ అమలుకు వచ్చేసరికి అందులో 40 శాతం కూడా పూర్తి చేయలేకపోయింది. కీలకమైన జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏ, మెట్రో, హెచ్ఆర్‌డీసీఎల్, మూసీ వంటి విభాగాలకు సుమారు రూ.10వేల కోట్ల వరకు కేటాయింపులు చూపారు. కానీ గడిచిన ఏడాది కాలంగా ఆయా విభాగాలకు విడుదల చేసిన నిధులు పరిశీలిస్తే... రూ.2600-3వేల కోట్ల లోపు మాత్రమే ఉంది. అంటే కేటాయింపుల్లో పావు వంతు మాత్రమే కాసులు విదిల్చారు.



26 ఏప్రిల్, 2022న కొత్తపేటలో టిమ్స్ ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాటి సీఎం కేసీఆర్

### గతేడాది లెక్కలతోనే సరిపెట్టిన సర్కారు...

హైదరాబాద్ నగరాభివృద్ధిపై తొలి ఏడాదిలోనే బోర్లాపడిన రేవంత్ సర్కారు తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో గొప్పలకు పోలేదుగానీ పాత లెక్కలనే తిరగేసి మమ అనిపించినట్లు తేటతెల్లమైంది. జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏ, హైదరాబాద్ మెట్రో, హెచ్ఆర్‌డీసీఎల్‌కు సరిగ్గా గత సంవత్సరం ఎలాంటి కేటాయింపులు చేశారో ఇప్పుడు కూడా అవే అంకెలు కనిపించాయి. కానీ ఆయా విభాగాల పరిధుల్లో కొత్తగా వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులను భుజానికెత్తుకున్నారు. మెట్రో విస్తరణ ప్రాజెక్టును రూ.24వేల కోట్లతో ఏకంగా డీపీఆర్‌ను సిద్ధం చేయగా, మరో రూ.20వేల కోట్ల విలువైన మేడ్చల్ మెట్రోకు సైతం సర్వేను మొదలుపెట్టారు. అదేవిధంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ) కింద శరవేగంగా జరిగిన ఫ్లైఓవర్లు, వంతెనల నిర్మాణాల పనులు గతేడాది కాలంగా పడకేశాయి. ఇవే పనుల ప్రతిపాదనలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్ఆర్‌డీపీ పేరు (మిగతా IIవ పేజీలో)



కాంగ్రెస్ పాలనలో నత్తనడకన సాగుతున్న కొత్తపేట వైద్యశాల నిర్మాణ పనులు



పెద్దచెరువు ఎస్‌టీపీని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్) (బీఆర్ఎస్ సర్కారు ఈ ఎస్‌టీపీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది).

# కేసీఆర్ ప్రాజెక్టులకు
## కాంగ్రెస్ ప్రారంభోత్సవాలు

- శంకుస్థాపనలకే పరిమితమైన కాంగ్రెస్ ఏడాది పాలన
- రెండో బడ్జెట్‌లోనూ నగరాభివృద్ధికి అరకొర నిధులు
- బీఆర్ఎస్ సర్కారు ప్రాజెక్టులకు కాంగ్రెస్ ఘనంగా ప్రారంభోత్సవాలు

సిటీబ్యూరో, మార్చి 19(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ఏడాది పాలనలో హైదరాబాద్ నగరానికి ఒరిగేదేమి లేదు. ఇప్పటివరకు రెండు దఫాలుగా బడ్జెట్ ప్రవేశపెట్టిన కాంగ్రెస్ సర్కారు.. నగరాభివృద్ధికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపాదించి, చేపట్టిన ప్రాజెక్టులను ప్రారంభించిందే తప్పా... సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ఏ ఒక్క ప్రాజెక్టు విషయంలోనూ తట్టెడు మట్టిని తీసిన దాఖలాలు లేవు. కానీ బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన చివరి దశలో ఉన్న ప్రాజెక్టులను ఇప్పుడు హడావుడి పూర్తి చేసి...ఘనంగా ప్రారంభోత్సవాలను నిర్వహిస్తుందే తప్పా... ఇప్పటివరకు తమ కలల ప్రాజెక్టులనీ కాంగ్రెస్ సర్కారు చెప్పుకున్న ఏ ఒక్క ప్రాజెక్టు కూడా కార్యారూపంలోకి కూడా తీసుకురాలేకపోయిందనే దానికి హైదరాబాద్ కేంద్రంగా గడిచిన ఏడాది కాలంగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు, ప్రారంభించిన ఫ్లైఓవర్లు, ఎస్‌టీపీలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలో మెరుగైన రవాణా సౌలతులను కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టును హెచ్-సిటీగా మార్చిన కాంగ్రెస్ సర్కారు... చివరి దశలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి ఘనంగా ప్రారంభోత్సవ వేడుకలను నిర్వహించినవే నగరవాసులకు కనిపిస్తున్నాయి.

### శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు..

మార్చి 7 2024న ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం రోడ్డు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 18కిలోమీటర్ల పొడువైన ఈ రెండు ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ. 2900 కోట్లు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ సాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరో ఏడాది సమయం పట్టేలా ఉంది.

☞ డిసెంబర్ 3 2024న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గ్రేటర్ పరిధిలో బ్యూటిఫికేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టబోయే 6 జంక్షన్ల అభివృద్ధి, 7 ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి పునాది వేశారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు భూసేకరణకే పరిమితమైంది. కనీసం ఈ ప్రాజెక్టు కోసం సొంత పార్టీ నేతల నుంచే భూములను సేకరించలేకపోయారు.

☞ మార్చి 8 2024న ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు నిర్మించనున్న ఓల్డ్ సిటీ మెట్రోకు శంకుస్థాపన చేశారు. రూ. 2వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు కోసం తాజా బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించారు. ప్రతిపాదిత నిధులతో 7.2 కిలోమీటర్ల మీర చేపట్టాల్సిన భూసేకరణ కూడా పూర్తి చేయలేని పరిస్థితి ఉంది.

☞ గతేడాది సెప్టెంబర్‌లో మీరాలం లేక్ ప్రాంతంలో పర్యటించిన రేవంత్‌రెడ్డి... ఈ ప్రాంతంలో హైదరాబాద్‌లోనే రెండో కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. దాదాపు రూ.650 కోట్ల అంచనా వ్యయంతో బెంగళూరు హైవే నుంచి చింతల్‌మెట్ మీదుగా అత్తాపూర్ వరకు 2.65 కిలోమీటర్ల పొడవైన కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేస్తామని ప్రకటించగా... ఇప్పటివరకు కనీసం టెండర్లను కూడా పిలవలేదు. గ్రేటర్ పరిధిలో రూ. 150 కోట్లతో సుందరీకరణ పనులు, రూ. 3500 కోట్లతో రహదారి అభివృద్ధి పనులకు ప్రజాపాలన విజయోత్సవ వేదిక నుంచి శంకుస్థాపన చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు మీటర్ దూరం కదిలించలేదు.

### బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రాజెక్టులు

ఐటీ కారిడార్‌లో మెరుగైన రవాణా సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం గోపన్‌పల్లి కేంద్రంగా హైలెవల్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను చేపట్టింది. అప్పటికే 98 శాతం పనులు పూర్తి చేయగా... ఎన్నికల కారణంగా కొంత జాప్యం జరిగింది. అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలో మిగిలిన ఆ కొద్ది పనులను అట్టహాసంగా పూర్తి చేసి... గోపన్‌పల్లి కేంద్రం భారీ బహిరంగ సభతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. 2020లో వచ్చిన వరద ముప్పును దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ సర్కారు (మిగతా IIవ పేజీలో)

## మెట్రో ఘనం..
## కేటాయింపులు శూన్యం

సిటీబ్యూరో: మెట్రో ప్రాజెక్టుపై కాంగ్రెస్ మొండిచేయి చూపింది. రెండో దశ విస్తరణ కోసం మెట్రో ఏకంగా రూ. 24వేల కోట్ల అంచనాలతో ప్రతిపాదనలను సిద్ధం చేసి చేతిలో పెట్టుకుంటే... రేవంత్ రెడ్డి సర్కారు రూ. 500 కోట్లు కేటాయించి చేతులు దులుపుకొంది. ఇక రెండో దశలోనే నార్త్ సిటీ వరకు మెట్రో విస్తరిస్తామని చెప్పి... డీపీఆర్ సిద్ధం చేస్తుండగా... ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం మరో రూ. 20వేల కోట్లకు చేరనుంది. ఈ రెండు కలిపితే ఏకంగా రూ. ఏకంగా రూ.44వేల కోట్ల అంచనాతో ప్రతిపాదనలు ఉంటే... ప్రభుత్వం కేటాయించిన నిధులతో మెట్రో వర్గాలు నివ్వెరపోతున్నాయి.

## మూసీకి నిధులేవీ?

సిటీబ్యూరో: అధికారంలోకి విచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ సర్కార్ మూసీ జపం చేసి.. తాజా బడ్జెట్‌లో మూసీ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో లక్షా యాభై వేల కోట్ల రూపాయల వ్యయంతో మూసీ నదిని ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం అని ప్రకటించినప్పటికీ బడ్జెట్‌లో మాత్రం ఆ దిశగా నిధులు కేటాయింపు ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. ఇంతదానికి ప్రభుత్వం మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదల ఇండ్లపై యుద్ధం ఎందుకు చేసిందంటూ సామాజికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. సుందరీకరణ పేరుతో మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న పేదల ఇండ్లను కూల్చేసి వారి జీవితాలను రోడ్డున పడేసింది ప్రభుత్వం. సుమారు 172 ఇండ్లను నేలమట్టం చేసింది. అందులో నివసించే కుటుంబాలు కన్నీటి భారంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. వారందరికి డబుల్ బెడ్ రూంలు కేటాయించామని ప్రభుత్వం చెప్పినా.. చెట్టుకొకరూ.. పుట్టకొకరులా ఆ కుటుంబాలను చెల్లా చెదురు చేసింది.

## వర్ష సూచన

సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజుల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# రియల్ విలవిల.. ఖజానా వెలవెల
## ఆర్ఆర్ఆర్ వరకు హెచ్ఎండీఏ విస్తరణ జరిగినా.. కేటాయింపులు లేవు

సిటీబ్యూరో: కుప్పకూలిన రియాల్టీతో హెచ్ఎండీఏ ఖజానా ఖాళీ అవుతుంటే.. ప్రభుత్వం నుంచి నిధుల్లేక విలవిల్లాడిపోతున్నది. ప్రతిష్టాత్మక ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ సర్కారు చెప్పుకుంటున్నా.. ప్రాజెక్టుల నిర్మాణానికి చిల్లి గవ్వ అదనంగా ఇవ్వడం లేదు. గతంలో హెచ్ఎండీఏకు వచ్చే ఆమ్దానీతో వరల్డ్ క్లాస్ నగరానికి అనువైన ప్రాజెక్టులు చేపట్టడంతో పాటు, ఇతర విభాగాల పరిధి నిర్మించే ప్రాజెక్టులకు కూడా ఆర్థిక వనరులను హెచ్ఎండీఏ సమకూర్చితే.. ఇప్పుడు సొంత పనులు చేపట్టడానికి అవసరమైన నిధుల కోసం బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక బిల్డింగ్ అనుమతులు, ఇతర అనుమతుల ద్వారా నెలవారీగా వచ్చే ఆదాయం సగానికి పడిపోయింది. కనీసం ప్రభుత్వమైన భారీ స్థాయిలో నిధులు కేటాయిస్తుందని భావిస్తే.. అత్తెసరు నిధుల కేటాయింపులతో చేతులు దులుపుకొంది. ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులు, లింకు రోడ్ల నిర్మాణం, గ్రీన్ ఫీల్డ్ హైవే, కొత్వాల్‌గూడ ఏకో పార్క్‌తో పాటు నగరంలో రెండో అతిపెద్ద కేబుల్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టుల కోసం రూ. 5-6వేల కోట్లు వెచ్చిస్తే తప్ప.. పనులు చేపట్టే అవకాశం లేకుండా పోయింది. కానీ ప్రభుత్వం రూ. 500 కోట్లను బడ్జెట్‌లో కేటాయించి చేతులు దులుపుకొంది. ఇక 7200 చదరపు కిలోమీటర్లు ఉన్న హెచ్ఎండీఏ పరిధిని మరో నాలుగు జిల్లాల్లోని 3వేల కిలోమీటర్లకు విస్తరించినా ఆ స్థాయి నిధులివ్వలేదు. కనీసం పెరిగిన పరిధికి అనుగుణంగా నిర్వహణ ఖర్చులకు అయ్యే రూ. 30 కోట్లు కూడా బడ్జెట్‌లో చూపలేదు.

### చేతి నిండా ప్రాజెక్టులే..

హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో హెచ్ఎండీఏ కీలక పాత్రను పోషిస్తోంది. కొత్తగా పెరిగిన విస్తీర్ణానికి అనుగుణంగా 10 వేల చదరపు కిలోమీటర్లకు విస్తరించిందనే గొప్పలు చెప్పుకోవడమే తప్ప.. విస్తరణకు అనుగుణంగా హెచ్ఎండీఏ పరిధిలో మౌలిక వసతులకు అవసరమైన నిధులు లేకపోవడంతో.. అభివృద్ధి కుంటు పడే అవకాశమే కనిపిస్తోంది. కనీసం సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రాజెక్టులన్నీ శంకుస్థాపన చేసిన 18 కిలోమీటర్ల రెండు ఎలివేటెడ్ మార్గాలు, 7 కి.మీల మీరాలం కేబుల్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టులకైనా ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ఏడాది పూర్తయినా.. ఇప్పటికీ భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయలేకపోయారు. ఇలా చేతి నిండా ప్రాజెక్టులు ఉన్నా.. ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహకాలు లేకపోవడంతో, ఏటా ఓఆర్ఆర్ ప్రాజెక్టు కోసం బ్యాంకులకు ఇచ్చే యాన్యుటీ చెల్లింపులకే ప్రభుత్వం ఇచ్చే రూ. 500 కోట్లు సరిపోయే పరిస్థితి నెలకొని ఉంది. పరిధి పెంచి ఉత్సాహం నింపిన హెచ్ఎండీఏకు.. ప్రభుత్వం నిధులు కేటాయించకుండా నిర్జీవంలా మార్చుతుందనే విమర్శలు వస్తున్నాయి. గతేడాది కూడా రూ.500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా అదనంగా విడుదల చేయలేదు.



కేసీఆర్ సర్కారు హయాంలో శరవేగంగా నడిచి.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నత్తనడకన సాగుతున్న సైదాబాద్ ఫ్లైఓవర్ నిర్మాణం

### అప్పుల కోసం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే..

ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలో చేపట్టనున్న ప్రాజెక్టుల అంచనా వ్యయం దాదాపు రూ. 23వేల కోట్లు అవుతుందనే అంచనాలు ఉన్నాయి. తాజా బడ్జెట్‌పై గంపెడాశలతో ఉన్న అధికారులకు ప్రభుత్వం రిక్తహస్తమే చూపి, అప్పుల కోసం హెచ్ఎండీఏను ప్రేరేపితం చేసింది. ఇప్పటికే నిధులను సమకూర్చుకునే క్రమంలో హెచ్ఎండీఏ ఆస్తులను తనాఖా పెట్టేందుకు సిద్ధంగా ఇందుకోసం ఏజెన్సీలను కూడా నియమించుకుంది. దీంతో బడ్జెట్ ఆశలు నీరుగారిపోవడంతో ఆస్తుల ద్వారా నిధులను సమకూరితే తప్ప.. హెచ్ఎండీఏ పరిధిలో అభివృద్ధి పనులకు ఆస్కారమే లేకుండా పోయింది.



గచ్చిబౌలిలో ఇంకా నిర్మాణ దశలోనే ఉన్న ఫ్లైఓవర్

# అడిగిన దాంట్లో సగమే?

- జీహెచ్ఎంసీకి నామమాత్రపు బడ్జెట్‌తో సరి
- రూ. 7582 కోట్లు అడిగితే... ఇచ్చింది కేవలం రూ. 3101.21 కోట్లు మాత్రమే

సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. బడ్జెట్‌లో రూ.10వేల కోట్లకు పైగా నిధులు ఇచ్చాం.. గతేడాది బడ్జెట్ కేటాయింపుల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన గొప్ప ప్రకటనలు..కానీ ఆచరణలో మాత్రం ముఖ్యమైన ప్రాజెక్టు ఏ ఒక్కటి పట్టాలెక్కలేదు..ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన హెచ్ సిటీ ప్రాజెక్టు పనులు ఒక్కటి కూడా మొదలుకాలేదు.. వాస్తవంగా కేటాయించిన బడ్జెట్‌లో పావు వంతు కూడా నిధులు మంజూరు చేయలేకపోవడం సర్కారు ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతున్నది. ఇదిలా ఉంటే బుధవారం ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులో జీహెచ్ఎంసీకి నామమాత్రంగా రూ.3101.21 కోట్లు మాత్రమే కేటాయింపులు జరిపింది. చేతిలో కీలకమైన హెచ్ సిటీ ప్రాజెక్టులు ఉన్నాయని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల దృష్ట్యా పలు అభివృద్ధి ప్రతిపాదనలు పట్టాలెక్కించాల్సిన అవసరం ఉందంటూ జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి గంపెడాశలతో రూ. 7582 కోట్లు కావాలని ప్రతిపాదనలు సమర్పించింది. కానీ ప్రజా పాలన సర్కారు మాత్రం గ్రేటర్ అభివృద్ధిపై మరోసారి శీతకన్ను వేసి 40 శాతం మాత్రమే బడ్జెట్ కేటాయింపులు జరిపింది.

### సక్రమంగా లేని నిధుల విడుదల

బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే ఏ ఒక్క ప్రాజెక్టు కూడా ఈ ఏడాదిలో పూర్తి అయ్యేలా కనబడడం లేదు. గతేడాది హెచ్ సిటీ ప్రాజెక్టుకు రూ.2600కోట్లు కేటాయిస్తే నిధుల విడుదల సక్రమంగా లేకపోవడంతో గజం స్థలం కూడా భూ సేకరణ జరపలేదు. రాబోయే రోజుల్లోనూ ఆశించిన స్థాయిలో పనులు జరిగేలా లేవు..జీహెచ్ఎంసీ రూ. 4వేల కోట్లు అవసరమని అడిగితే రూ.2654 కోట్లు మాత్రమే కేటాయించింది. వాస్తవంగా ప్రాజెక్టు సకాలంలో (మిగతా IIవ పేజీలో)

# సమస్యలు పరిష్కరించాలంటే.. అణచేస్తారా

### విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన
### విద్యార్థి నేతలు అదుపులోకి..

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళనలు చేయకూడదని అధికారులు జారీ చేసిన సర్క్యులర్ కు వ్యతిరేకంగా ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న ఉద్యమం ఉధృతమైంది. దీనిపై ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ను కలిసి వినతి పత్రం అందజేసిన విద్యార్థి నాయకులు ఓయూ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యమాలు నిర్వహిస్తున్న విద్యార్థి పోరాటాలను అణిచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన ఓయూ వైస్ ఛాన్సలర్ ఎం.కుమార్ కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఓయూలో ఉద్యమాలను నిషేధిస్తూ విడుదల చేసిన సర్క్యులర్ ను తక్షణమే వాపస్ తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో సందర్భంగా అరెస్టయిన వారిలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎస్.నాగేశ్వరావు, ఎన్.సుమంత్, జంగిలి దర్శన్, పెద్దమ్మ రమేశ్, జంగయ్య, మొగిలిపాక నవీన్, చేరాల వంశీ, రాజేశ్ నాయక్, మిథున్ ప్రసాద్, రామకృష్ణ, శివ, ఎం.వెంకటేశ్, ఎస్.అంజి తదితరులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు